## క్లుప్తంగా

### పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పట్టణానికి చెందిన బి.శంకర్‌రెడ్డి (45 )కి మరికొంతమందితో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వీటి విషయమై ఇటీవల గొడవలు జరుగుతున్న నేపథ్యంలో తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని భావిస్తూ సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. టూటౌన్ ఎస్సై సువర్ణ మృతుని కుటుంబసభ్యుల నుంచి వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### రైల్వేట్రాక్ పక్కన మృతదేహం లభ్యం


జితేందర్ సింగ్ మృతదేహం

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె పంచాయతీ పరిధిలోని సంగపేట గ్రామంలోని వెలిగొండ ప్రాజెక్టు నీటి కాలువ సమీపంలో రైల్వే ట్రాక్ వెంబడి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్ నుంచి రైల్వే పనులు చేసేందుకు వచ్చిన జితేందర్ సింగ్ అనే వ్యక్తి మద్యం సేవించి నూతనంగా వేస్తున్న డబుల్ రైల్వేలైన్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తలకు తీవ్రంగా గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణపావని సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వీఆర్‌ఓ యోన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రూ.12.45 లక్షల విలువైన మిరప విత్తనాలు సీజ్

మార్కాపురం: పట్టణంలో 4 విత్తనాల దుకాణాలపై సోమవారం సాయంత్రం దర్శి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విత్తన కంపెనీల అనుమతిపత్రాలు లేకుండా విక్రయానికి సిద్ధంగా ఉన్న 26 కేజీల హైబ్రిడ్ మిరప విత్తనాలను సీజ్ చేసినట్లు దొనకొండ ఏఓ లక్ష్మీ నారాయణ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12.45 లక్షలు ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా విత్తనాలు ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లులు తీసుకోవాలని ఆయన కోరారు.

### పాఠశాలకు గ్రామస్తుల సహకారం అవసరం

పుల్లలచెరువు: గ్రామాల్లోని పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తుల సహకారం అవసరమని ముటుకుల జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రాఘవరెడ్డి అన్నారు. ముటుకుల గ్రామానికి చెందిన ఉప్పాల చిన్న కొండలు తన కుమారుడు సాయిచరణ్ తేజ్ ఈ సంవత్సరం జేఈఈ అడ్వాన్స్‌లో 642 ర్యాంకు వచ్చిన సందర్భంగా సోమవారం స్థానిక జెడ్పీ పాఠశాలకు రూ.30 వేల విలువచేసే కంప్యూటర్‌ను బహూకరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయమని, చిన్న కొండలు కొన్నేళ్లుగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, తదితర వస్తువులు అందస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు.

### రైతులకు ఉచితంగా కందుల పంపిణీ

ముండ్లమూరు: ఖరీఫ్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చిరుధాన్యాల విత్తనాలను సోమవారం ఉచితంగా అందజేశారు. మండలంలోని వేముల–2 సచివాలయం పరిధిలో గల కమ్మవారిపాలెం, రాజగోపాలరెడ్డినగర్, రమణారెడ్డిపాలెం, వేములబండ గ్రామాల రైతులకు కందులు అందజేశారు. ఒక్కో రైతుకు నాలుగు కేజీల చొప్పున ఆరు క్వింటాళ్ల కందులు అందజేశారు. ఈఓఆర్డీ రాజశేఖరరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు తిప్పాస్వామి, రైతులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాలలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు


పొన్నలూరులో పవన్‌కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు


సంతనూతలపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్‌లు

# పవన్‌కళ్యాణ్‌పై భగ్గుమన్న వలంటీర్లు

- వలుచోట్ల పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం
- నల్లబ్యాడ్జీలతో నిరసన
- పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు

మార్కాపురం:

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు నీతిబాహ్యమైనవని, ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు సమాచారమిస్తున్నారంటూ తమ మనోభావాలను దెబ్బతీశారని జిల్లాలోని వలంటీర్లు నిప్పులు చెరిగారు. గ్రామాలు, మండల కేంద్రాల్లో మానవహారంగా ఏర్పడి పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ నినాదాలు చేశారు. ర్యాలీలు నిర్వహించి, పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మలు దహనం చేశారు.

■ ఉమన్ ట్రాఫికింగ్ చేస్తున్నామంటూ తమపై ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని మార్కాపురం పట్టణ వలంటీర్లు సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రతి నెలా 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి పింఛన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న తమపై పవన్ అనుచితంగా మాట్లాడటం తగదన్నారు. ఆయన దగ్గర ఉన్న ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశబూరు. కార్యక్రమంలో వలంటీర్లు డి.ఖాశీం, యూ శ్రీనివాసులు, ఎస్కే ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

**పవన్ క్షమాపణ చెప్పాలి**

తర్లుపాడు: ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు సమాచారమిస్తున్నారన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండలంలోని పోతలపాడు సచివాలయం వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కల్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలియచేశారు. కార్యక్రమంలో జె.గురవయ్య, ఆర్.సురేష్, ఎస్.మీరావలి, ఎస్.రవితేజ, సీహెచ్ రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

■ చీమకుర్తి: వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ క్షమాపణలు చెప్పాలని సంతనూతలపాడు వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం సంతనూతలపాడులోని 1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్‌లను పవన్ కల్యాణ్ దారుణంగా మాట్లడటం తగదని హెచ్చరించారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. వలంటీర్లకు సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మద్దులూరు సర్పంచ్ బీ.శైలజ సంఘీభావం తెలిపారు.

**పవన్‌వి దిగజారుడు మాటలు**

పొన్నలూరు: గ్రామ వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేస్తున్న దిగజారుడు మాటలు మానుకోవాలని వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు పిల్లిపోగు జీవన్‌కుమార్ హితవుపలికారు. ఆదివారం ఏలూరులో పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పొన్నలూరులో సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వలంటీర్లపై ఇష్టానుసారంగా నిరాధారమైన ఆరోపణలు చేసిన పవన్‌కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్సై రాజారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్కే గౌస్‌బాషా, ఎం జక్రయ్య, రాజు, నాగేంద్రబాబు, చిన్న, మోషే తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దదోర్నాల: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తమకు వెంటనే క్షమాపణ చెప్పాలంటూ మండలంలోని వలంటీర్లు నల్ల బ్యాడ్జీలతో సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని మహిళా వలంటీర్లు కొడుతూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పవన్ కళ్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై అంకమరావుకు ఫిర్యాదు చేశారు.

**కొత్తపట్నంలో మానవహారం, ర్యాలీ**

కొత్తపట్నం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కొత్తపట్నంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి నినాదాలు చేస్తూ బస్టాండ్ కూడలికి చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. వలంటీర్లకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి సంఘీభావం తెలిపారు. పవన్ కళ్యాణ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వలంటీర్లకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ పిచ్చివాడిలా మాట్లాడటం మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ పి.సుజాతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, తాతా శ్రీను, నాంచార్లు, తుమ్మ పుల్లయ్య, బాబు, కోడూరి వెంకారెడ్డి, వాలింటీర్లు రవి, వెంకటేశ్వర్లు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

**క్షమాపణ చెప్పే వరకు నిరసన తెలపండి**

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కళ్యాణ్ ఆరపణలు చేయటం సిగ్గుచేటని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. సోమవారం చీమకుర్తి మండలం తొర్రగుడిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో పవన్ వ్యాఖ్యలపై స్పందించారు. కరోనా సమయంలో పవన్ కల్యాణ్, చంద్రబాబు హైదరాబాద్‌లోని ఇళ్లలో కూర్చుంటే, వలంటీర్లు తమ ప్రాణాలను సైతం లెక్క చేయండా కరోనా బాధితుల ఇళ్లకు వెళ్లి నిర్భయంగా సేవలందించారని గుర్తు చేశారు. అలాంటి వలంటీర్లపై పవన్ కళ్యాణ్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. పవన్ కల్యాణ్‌కు బుద్ధి వచ్చి క్షమాపణ చెప్పే వరకు నిరసన తెలపాలని వలంటీర్లకు పిలుపునిచ్చారు.


మార్కాపురంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు


తర్లుపాడులో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వలంటీర్లు


కొత్తపట్నంలో ర్యాలీలో పాల్గొన్న వలంటీర్లు

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో టోకరా


స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో ఒంగోలుకు చెందిన అవర్ జాబ్ సొల్యూషన్ అనే సంస్థ నిర్వాహకుడు వంశీకృష్ణ రూ. 2 లక్షలు తీసుకొని మోసం చేశాడని బేస్తవారిపేటకు చెందిన టి.రమణారెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీ మలికాగర్గ్‌కు ఫిర్యాదు చేశారు. తన బావమరిదికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.2 లక్షలు ఇచ్చామని, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ లేఖ ఇచ్చి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పుడు తాము ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడుగుతుంటే సమాధానం చెప్పడం లేదని వాపోయారు.


■ సింగరాయకొండలోని శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన రవిచంద్ర కుమార్ తమకు తెలియకుండా తమ ధ్రువీకరణ పత్రాలతో ఫైనాన్స్‌లో టీవీ కొన్నాడని, ఇప్పుడు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఈఎంఐ కట్టమని తమను వేధిస్తున్నారని అదే గ్రామానికి చెందిన పి.సుబ్రమణ్యం ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. స్పందనకు మొత్తం 96 ఫిర్యాదులు రాగా వాటిపై స్పందించిన ఎస్పీ వెంటనే ఆయా పోలీసుస్టేషన్లకు ఫోన్ చేసి మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఒంగోలు సబ్‌డివిజన్ డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


పోలీసులను కలిసిన ప్రేమజంట

ఒంగోలు టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని పుల్లలచెరువుకు చెందిన ప్రేమజంట పోలీసులను రక్షణ కోరారు. పుల్లలచెరువు గ్రామానికి చెందిన దేశావత్ రూపాబాయి, పవన్ కుమార్‌లు సోమవారం ఎస్పీ కార్యాలయంలో స్పందనలో పోలీసు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాకు వివరాలను వెల్లడించారు. దేశావత్ రూపాబాయి గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెకు అదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలనుకున్న వీరిద్దరూ ఈ విషయాన్ని ఇళ్లల్లో పెద్దలకు తెలియజేశారు. ఈపెళ్లికి పవన్ కుటుంబ సభ్యులు అంగీకరించగా రూప కుటుంబసభ్యులు ఒప్పుకోలేదు. దీంతో నాలుగు నెలల క్రితం గుడిలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇంట్లో విషయం చెప్పగా..తల్లిదండ్రులు మేం చూసిన సంబంధమే చేసుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. గర్భిణి అయిన రూపను నంద్యాలలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లి బలవంతంగా సంతకాలు చేయించి అబార్షన్ చేయించారు. మరో పెళ్లికి ఏర్పాటు చేస్తుండటంతో ఈ నెల 9న పెద్దలకు తెలియకుండా ఇంటి నుంచి వచ్చేశారు. మాకు రక్షణ కల్పించాలని, తన మీద దాడి చేసిన తలిదండ్రులు, మావయ్య, అమ్మమ్మలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి


సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో మరియదాసు

పుల్లలచెరువు: గ్రామాల్లోని ప్రజలకు సచివాలయాల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీడీవో మరియదాసు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఐటీ వరం సచివాలయాలన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. త్వరలో ఈ పంచాయతీలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

## రాజకీయాలకతీతంగా సంక్షేమ ఫలాలు


- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు


సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కంభం: రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలందుతున్నాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కంభం–2,3 సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు, అమ్మఒడి, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్న నాయకుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హతే ఉంటే చాలు ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి దరఖాస్తు చేసుకొని సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో వెళ్తుంటే ప్రజలు సంతోషంగా స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉండటం వల్లే తాము ధైర్యంగా గ్రామాల్లో పర్యటించి గలుగుతున్నామన్నారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా సంక్షేమ పథకాలు పొందలేని వారు జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం..కార్యక్రమాల ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. నవరత్నాల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఇప్పటికే 99 శాతం అమలు పరిచారన్ని తెలిపారు. సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, ఎంపీటీసీలు రఫీ, ఆనంద్, రామ్మూర్తి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఔరంగబాద్ మాజీ సర్పంచ్ సబ్బసాని సాంబశివారెడ్డి, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, తహసీల్దార్ శైలేంద్రనాథ్, కార్యదర్శి బ్రహ్మయ్య వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటా సంక్షేమ పథకాల వెల్లువ

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: రాష్ట్రంలో ఇంటింటా సంక్షేమ పథకాల ఒరవడి కొనసాగుతోందని, రాజకీయాలతో సంబంధం లేకుండా, కుల, మత బేధాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం భూపతిపల్లి సచివాలయం పరిధిలోని బొడిచెర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రజలు చెప్పిన పలు సమస్యలను ఆయన ఓపికగా విని నోట్ చేసుకుని సంబంధిత శాఖాధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.కోటేశ్వరి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, కో ఆప్షన్ సభ్యులు షేక్ మహమ్మద్ రఫీ, మార్కెట్ యార్డు డైరెక్టర్ భవనం రమ, సచివాలయ కన్వీనర్ భవనం వెంకట్రామిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ ఉమా మహేశ్వరరావు, ఉప సర్పంచ్ పి.నాగమల్లీశ్వరి, ఎంపీడీఓ నరసింహులు, ఏవో శ్రీనివాసరెడ్డి, ఏపీఎం రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ కోలగట్ల శివారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కంటి శస్త్రచికిత్సకు 48 మంది తరలింపు

తాళ్లూరు (ముండ్లమూరు): కంటి శస్త్ర చికిత్సలకు తాళ్లూరు పీహెచ్‌సీ నుంచి 48 మందిని గుంటూరు వద్ద గల కాకాని శంకర కంటి వైద్యశాలకు తరలించినట్లు వైద్యాధికారిణి ఎస్కే ఖాదర్‌మస్తాన్‌బీ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో శస్త్ర చికిత్సలు అవసరమైన 48 మందిని గుర్తించడం జరిగిందన్నారు. వారందరికీ పూర్తి సౌకర్యాలతో ఆపరేషన్ల అనంతరం తిరిగి ఇంటికి చేరుస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రమీల, ఫార్మసిస్ట్ రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, సిబ్బంది చంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

### వంద మంది గర్భిణులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏరియా వైద్యశాలలోని 100 మంది గర్భిణులకు సీవీ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో గడపాలని కోరారు. వైద్యులు సుధాకర్, ఆశియా, వైఎస్సార్ సీపీ నాయకులు జయరామిరెడ్డి, గోపాల్ యాదవ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

### పైసా ఖర్చు లేదు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నీనావత్ రాయుడు నాయక్. పుల్లలచెరువు మండలం మానేపల్లి తండాలో ఉంటున్నాడు. మండల కేంద్రానికి రావాలంటే 30 కిమీ రావాలి. గతంలో నవరత్నాల్లో భాగంగా పలు పథకాలతో ఇతని కుటుంబం లబ్ధి పొందింది. నేడు జగనన్న సురక్షలో ఒకేసారి రూపాయ ఖర్చు లేకుండా కుల, ఆదాయ పత్రాలు పొందారు. గతంలో ఈ పత్రాలు కావాలంటే 30 కిమీ వచ్చి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, నేడు సురక్ష పథకంతో మా లాంటి నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని ఆనందం వ్యక్తం చేశాడు.

### వైఎస్సార్ ఆసరాకు అర్హత వచ్చింది



ఈమె పేరు అవుల నాగలక్ష్మి. ఊరు మోడంపల్లె. వైఎస్సార్ ఆసరా చేయూత కోసం కులం, ఆదాయం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు ఒకే రోజులో సచివాలయం అధికారులు ఆమె చేతికి అందించారు. వైఎస్సార్ ఆసరా చేయూతకు అర్హత రావడంతో జగన్నకు రుణపడి ఉంటానంటోంది. 50 ఏళ్ల దాటిన ఆమె గత ప్రభుత్వంలో పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ దాఖలు చేసుకుంది. ఆ తర్వాత మార్కాపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లమన్నారు. అలా నెలలు తిరిగినా పని కాలేదని చెబుతోంది. ఇప్పుడు వెంటనే పని పూర్తి అవుతున్నందుకు ఆనందంగా ఉందని చెబుతోంది.

### పిల్లల చదువులకు ఇబ్బంది లేదు



ఈమె పేరు నల్లబోతుల కళావతి. ఊరు కొండపేట. కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. భర్త ఆమెను వదిలేసి ఎటో వెళ్లిపోయి పదేళ్లవుతోంది. ఇద్దరు అమ్మాయిలను కష్టపడి చదివించుకుంటోంది. పెద్ద అమ్మాయి శిరీష డిగ్రీ చదువుతోంది. చిన్న అమ్మాయి మానస ఇంటర్ చదువుతోంది. వారికి కావాల్సిన కులం, ఆదాయం, పుట్టిన తేదీ సర్టిఫికెట్లను తిరగకుండానే జగనన్న సురక్ష ద్వారా అధికారులు అందించారు. తొలుత వలంటీర్ ఇంటికి వెళ్లి మీకు ప్రభుత్వం నుంచి ఏ రకం సర్టిఫికెట్లు కావాలని అడిగి వెళ్లాడు. ఆ సర్టిఫికేట్లు వెంటనే అందించేలా చేశారు. చాలా సంతోషంగా ఉందని కళావతి చెబుతోంది.

## మంత్రి సురేష్‌ను సన్మానించిన ఎమ్మార్పీలు



మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీలు

యర్రగొండపాలెం: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను మండల రీసోర్స్ పర్సన్స్ సోమవారం సన్మానించారు. గతంలో సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్లుగా విధులు నిర్వర్తించిన వీరిని అప్పటి టీడీపీ ప్రభుత్వం తొలగించింది. 489 మంది అర్ధాకాలితో అలమటించారు. పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్‌ను వారు కలిసి తమ బాధలు విన్నవించుకున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సాక్షర భారత్ మండల కో ఆర్డినేటర్లకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు పాలూరి శ్రీను, ఇరగదిండ్ల శ్రీనివాసరావు, కలివేల శామ్యూల్, నీలం సురేష్ పాల్గొన్నారు.

# పేదలకు వరం.. జగనన్న సురక్ష



మార్కాపురంలో సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

**దర్శి:** జగనన్న సురక్ష కార్యక్రమాలు పేదలకు వరమని కొత్తపల్లి సర్పంచ్ రాము అన్నారు. కొత్తపల్లి పంచాయతీలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు టీం, కొర్లమడుగులో డీటీ రవిశంకర్, ఈవోఆర్డీ శోభన్‌బాబు, స్థానిక 3వ సచివాలయంలో కమిషనర్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో కొర్లమడుగు సర్పంచ్‌లు సుబ్బలక్ష్మి సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

**దొనకొండ:** అర్హులందరికీ పథకాలు అందించేందుకు అవసరమైన పత్రాలు జారీ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాలు చేపట్టినట్లు ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 320 సర్టిఫికెట్లను ఎంపీపీ ఉషామురళి, తహసీల్దార్ ఎం.సువర్ణ, ఎంపీడీవో వి.వసంతరావునాయక్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు ఎగ్గోని కుమారి, ఉప సర్పంచ్ కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ముండ్లమూరు:** ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి తెలిపారు. మండలంలోని వేములబండ, జమ్మలమడక గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సచివాలయాల మండల కన్వీనర్ మేడికొండ జయంతి, తహసీల్దార్ నయీంఅహ్మద్, ఎంపీడీఓ కె.కుసుమకుమారి, ఈవోఆర్డీ రాజశేఖరరెడ్డి, డీటీ పుల్లారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కురిచేడు:** ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని దేకనకొండ, పడమరనాయుడుపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జేసీఎస్ కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, సర్పంచ్ యర్రగుంట్ల కీర్తి, ఎంపీటీసీ సోమవరపు అంకారావు, తహసీల్దార్ జ్వాలా నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు బెల్లం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. పడమరనాయుడుపాలెం గ్రామ సభలో సర్పంచ్ బి.మహేష్, మండల ఉపాధ్యక్షురాలు షేక్.కాశింబి, జేసీఎస్ కన్వీనరు మేరువ సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్లు బీ ఆంజనేయులు, లాగా నాసరమ్మ, పీ ప్రసాదు, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదు, డిప్యూటీ తహసీల్దార్ రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ బొమ్మనబోయిన వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి షేక్ బాషా, బి.ఆంజనేయులు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

**గిద్దలూరు రూరల్:** జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధి బందెలదొడ్డి బజారు 3వ సచివాలయం, నంద్యాల రోడ్డులోని 8వ సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కమిషనర్ వై.రామకృష్ణయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**బేస్తవారిపేట:** జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేయాలని ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నేకునాంబాద్ సచివాలయంలో జగనన్న సురక్షపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**కంభం:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. మండలంలోని కందులాపురం–3 సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ పథకాలు పొందలేక పోయినా, విద్యార్థులకు సర్టిఫికెట్లు, రైతులకు ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని), ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, తహసీల్దార్ శైలేంద్రనాథ్, జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి పాల్గొన్నారు.

**పుల్లలచెరువు:** సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మల్లాపాలెం, మానేపల్లి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష నిర్వహించారు. అర్హులకు పలు సర్టిఫికెట్స్ అందజేశారు. జెడ్పీటీసీ వాగ్యానాయక్, ఎంపీటీసీ రాములు, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, కన్వీనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం:** మండలంలోని వాదంపల్లి, అమానిగుడిపాడు సచివాలయాల పరిధిలో సోమ వారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు 713 సర్వీసులు పరిష్కరించారు. వాదంపల్లిలో 201 సర్వీసులు, అమానిగుడిపాడులో 512 సర్వీసులకు సంబంధించి లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రామిరెడ్డి, బాలకృష్ణ, సర్పంచ్ పబ్బిశెట్టి మంజుల శ్రీనివాస్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వై.వెంకటేశ్వరరెడ్డి, త్రిపురాంతకేశ్వర స్వామి ట్రస్ట్ సభ్యుడు ఎస్.వెంకటరెడ్డి, నాయకులు దుద్యాల రమణారెడ్డి, చిట్యాల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

**మార్కాపురం టౌన్:** సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 10వ సచివాలయ పరిధిలోని 15,16,17 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్ హర్షిత, శ్రీరాం సుంకయ్య, షెక్షావలి, డి.ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్ర, మున్సిపల్ ఆర్ఓ రంగారావు, ఆర్ఐ నాయక్ పాల్గొన్నారు.

■ **కొనకనమిట్ల:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థతో సుపరి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గార్లదిన్నె, వాగుమడుగు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సమావేశంలో సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. పలువురికి సర్టిఫికెట్లు అందించారు. ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ ప్రసాద్, ఈఓపీఆర్డి జనార్దన్, ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ పెదవెంకటరెడ్డి, తిరుపతిరెడ్డి, సర్పంచ్ కమలాకర్ పాల్గొన్నారు.

**తర్లుపాడు:** మండలంలోని పోతలపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సేధు మాధవన్ పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ అబ్దుల్ హమీద్, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

■ మండలంలోని సీతానాగులవరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి, జెడ్పీటీసీ ఇందిర పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ నరసింహులు, సర్పంచ్ ఆంజనేయులు, సూరెపల్లి సర్పంచ్ నవ్య, ఎంపీటీసీ రేగుల అంకయ్య, పార్టీ మండల కన్వీనర్ మురారి పాల్గొన్నారు.



పోతలపాడులో సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్ కలెక్టర్ సేధు మాధవన్



దొనకొండ : లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సువర్ణ



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న చైర్మన్, కమిషనర్



వై.పాలెం: లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు, నాయకులు

■ **పొదిలి:** పట్టణంలోని మూడో సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కమిషనర్ జోషఫ్ డానియేల్ పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ జి.చెన్నారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డి.శ్రీనివాసరెడ్డి, ముల్లా హసన్ వలి, అధికారులు పాల్గొన్నారు.

■ **పొదిలి రూరల్:** పొదిలి మండలంలోని ఏలూరు సచివాలయంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి శ్రీకృష్ణ,ఈఓఆర్డీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా సేవదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి,మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి,యూత్ అధ్య క్షుడు గిరిబాబురెడ్డి, సర్పంచ్ తాళ్లూరి సింగయ్య, జేసీఎస్ కన్వీనర్ పేరం సుభాష్ చంద్ర బోస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం రాయితీ

**కురిచేడు:** పండ్లతోటలు సాగుచేసే రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ మంజూరు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖాధికారి డి.సంధ్య తెలిపారు. మండలంలోని వ్యవసాయ సహాయకులకు బిందు, తుంపర్ల సేద్యంపై స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం శిక్షణ ఇచ్చి రాయితీల గురించి వివరించారు. మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పు చేయించుకోవాలి

**దర్శి:** ప్రతి గర్భిణీ ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పు చేయించుకోవాలని చందలూరు పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ సురేఖ కోరారు. చందలూరు పీహెచ్‌సీలో సోమవారం 28 మంది గర్భిణులకు 15 రకాల రక్త పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్‌సుక్రోజ్ ఇంజక్షన్లు చేశారు. సీహెచ్ఓ దయామణి, సిబ్బంది పాల్గొన్నారు.

### నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**కురిచేడు:** జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తనయుడు బూచేపల్లి కమలాకర రెడ్డి వర్ధంతి సందర్భంగా చీమకుర్తిలోని బూచేపల్లి వెంకాయమ్మసుబ్బారెడ్డి కల్యాణ మండపంలో ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్న నేత్ర వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు, మందులు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వాళ్లు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డుతో రావాలని ఆయన సూచించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

**కంభం:** హైవేలో ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు వేయించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవ రావు వినతిపత్రం అందజేశారు. కంభం, కందులాపురం పంచాయతీ పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని, పాదచారులు, వాహనదారులపై దాడుల చేస్తున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### విద్యార్థులు పాఠశాలల్లో ఉండాలి

**త్రిపురాంతకం:** విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్చి డ్రాపౌట్స్ లేకుండా చూడాలని విద్యాశాఖాధికారులు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డిలు కోరారు. త్రిపురాంతకంలోని ప్రైవేటు పాఠశాలలను వారు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా పాఠశాలల్లో ఉండాలని సూచించారు.

### కేజీబీవీ తనిఖీ

**పుల్లలచెరువు:** మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో శామ్యూల్‌జాన్ సోమవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా లెసన్ ప్లాన్స్ తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకుని వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి ఉన్నారు.

### తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

**రాచర్ల:** మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ శనివారం తన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటి నుండి వెళ్లిపోయిన షేక్ ఖాదర్‌వలి భార్య ఖాశింబీ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.కృష్ణపావని గాలిస్తున్న నేపథ్యంలో ఖాదర్‌వలి గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం భార్యకు సమాచారం అందించి తహసీల్దార్ ఎం.దిలీప్‌కుమార్ సమక్షంలో తప్పిపోయిన షేక్ ఖాదర్‌వలిని అతని భార్య షేక్ ఖాశింబీకి అప్పగించారు.

### బాల్య వివాహాల నిరోధానికి కృషిచేయాలి

**మార్కాపురం టౌన్:** బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలని సీఐ భీమానాయక్ మహిళా పోలీసులకు సూచించారు. సోమవారం పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. మహిళా పోలీసులు తమ పరిధిలో ఏం జరుగుతుందో రోజూ గమనించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, సంఘటనలను వెంటనే తెలపాలని సూచించారు. మహిళ, శిశు సంక్షేమశాఖ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది తమ పరిధిలో కార్యక్రమాలు తెలుసుకునే విధంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీడీపీఓ సుశీల పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

**మార్కాపురం:** నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఉదయ 7.30 నుంచి 8.30 వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### టీటీడీ కల్యాణ మండపానికి స్థలం కేటాయింపు

**దర్శి:** టీటీడీ కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ విడుదల చేసింది. సర్వేనంబర్ 349/2జీలో 2.46 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జీవో విడుదల చేయించారు. త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి

**మార్కాపురం:** వెలిగొండ ప్రాజెక్టును ప్రభుత్వం వేగంగా పూర్తిచేయాలని రైతు సంఘ కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వెలుగొండ ముంపు గ్రామాల రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

**పెద్దదోర్నాల:** పెద్దదోర్నాలలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మండల పరిధిలోని యడవల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.

### పేదలకు మెరుగైన వైద్యం

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



హెల్త్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

**గిద్దలూరు రూరల్:** పేదలందరికీ మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసిందని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని నరవలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష సమావేశాల్లో పాల్గొనే ముందుగా గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ సెంటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాలలు ప్రజలు పూర్తి ఆరోగ్య భద్రత కల్పిస్తాయన్నారు. ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఎమ్మెల్యే అన్నా అందజేశారు. ఎంపీపీ కడప లక్ష్మి, తహసీల్దార్ డి.సీతారామయ్య, ఎంపీడీఓ హేమలత, గ్రామ సర్పంచి బండి శ్రీనివాసులు, ఈఓఆర్డీ చెన్నారావు, వైస్ ఎంపీపీ నోవెల్, వైఎస్సార్ సీపీ నాయకులు ఓబులరావు, భూపాల్ యాదవ్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్‌కు గుణపాఠం చెబుతాం

**దర్శి:** నోటికొచ్చినట్లు వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తే వలంటీర్ల ద్వారానే గుణపాఠం చెబుతామని స్థానిక కౌన్సిలర్ వీసీ రెడ్డి పవన్ కళ్యాణ్‌ను హెచ్చరించారు. స్థానిక 3వ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం అనంతరం వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వలంటీర్లు ప్రజలకు ఎంతో సేవచేస్తున్నా ప్రతిపక్షాలు సంఘవిద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పవన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన వ్యక్తం చేయనున్నట్లు చెప్పారు.

**నేడు నిరసన ర్యాలీ..**

వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం దర్శిలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు దర్శిలోని ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జ్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.